క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి రూ.25వేలు విరాళం



విరాళం అందిస్తున్న మేకల కృష్ణారెడ్డి

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ ఖైకొం డాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీఅంకమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీమద్దిరావమ్మ దేవాలయ పునర్నిర్మాణానికి దాతలు విరాళం అందించారు. ఈమేరకు శనివారం 1వ డివిజన్ ఖైకొండాయిగూడెంకు చెందిన మేకలకృష్ణారెడ్డి,పుష్ప దంపతులు రూ.25,116లను దేవాలయ కమిటీ వారికి అందించినట్లు కమిటీ చైర్మన్ కొమ్ముభాస్కర్ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

ఖమ్మం మామిళ్లగూడెం: డాక్టర్ నవ్యకాంత్ ఆధ్వర్యాన ఎర్రబంజర గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నవ్యకాంత్ మాట్లాడుతూ.. వాతావరణంలో మార్పులు వలన వర్షాకాలంలో ప్రబలుతున్న వ్యాధులను దృష్టిలో పెట్టుకొని ఈ వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. కల్లూరు ప్రాథమిక వైద్యశాల పరిధిలో ఉన్న గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సన్మానం..



సంతోష్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: యూత్ జోడో బూత్ జోడో కార్యక్రమంలో భాగంగా క్విజ్ పోటీలు, డోర్ టూ డోర్ క్యాంపెయినింగ్ కార్యక్రమాన్ని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు యడ్లపల్లి సంతోష్ ఆధ్వర్యాన జిల్లాలో విజయవంతంగా నిర్వహించారు. శనివారం ఈమేరకు సంతోష్‌ను జాతీయ యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కృష్ణ అల్లవారు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం నాయకులు మహేష్, నవీన్‌రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

షర్మిలపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

ఖమ్మంరూరల్: వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిలపై పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని వైఎస్సార్‌టీపీ నాయకుడు నంద్యాల రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం రూరల్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నుంచి బీఫామ్ తెచ్చుకొని గెలిచి, స్వార్థం కోసం బీఆర్‌ఎస్‌లో చేరి ఇప్పుడు రాజశేఖర్‌రెడ్డి అభిమానుల మనస్సు గాయపడేలా మాట్లాడడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. షర్మిలను విమర్శించే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పాలేరులో షర్మిల గెలుపు ఖాయమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వైఎస్సార్ టీపీ నాయకులు బత్తిని యాలాద్రి తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లకు హెల్త్ కార్డుల పంపిణీ



హెల్త్‌కార్డులు పంపిణీ చేస్తున్న సుడా చైర్మన్

రఘునాథపాలెం: మండలంలోని 85 మంది చర్చి పాస్టర్లకు పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యాన మమత ఆస్పత్రిలో ఉచిత వైద్యం పొందేలా హెల్త్‌కార్డులను శనివారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచనల మేరకు పాస్టర్లకు ఉచిత వైద్యం అందించాలని హెల్త్ కార్డులు పంపిణీ చేసినట్లు సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మంత్రి పీఏ సీహెచ్.కిరణ్, రఘునాథపాలెం మండలం పాస్టర్ల ఫెలోషిప్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్, సెక్రటరీ ఎస్.లాజర్, ట్రెజరీ ఇమ్మాన్యుయేల్ రత్నం, స్పెషల్ ఆఫీసర్ ఎం.తిమోతి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	బేబి
వినోద	నాయకుడు
సాయిరాం	సామజవరగమన
ఆదిత్య	మిషన్ ఇంపాజిబుల్(తె)
శ్రీనివాస	మహావీరుడు

– ఖమ్మంగాంధీచౌక్

అరచేతిలో విరబూసే గోరింట..

ఆషాఢంలో అతివలు మెచ్చిన గోరింటాకు

- ఆడపిల్లలకు అందం, ఆరోగ్యం, ఆనందం
- పల్లెల్లో గోరింటాకు.. పట్టణాల్లో మెహందీలు..
- చేతులు, కాళ్లపై భిన్నమైన డిజైన్లు
- ఉపాధి పొందుతున్న పలువురు

సండే స్పెషల్



గుట్టలబజార్‌లోని రామకృష్ణ పాఠశాలలో గోరింటాకుతో ఉపాధ్యాయినులు, బాలికలు

'గోరింట పూచింది కొమ్మా లేకుండా.. మురిపాల అరచేత మొగ్గ తొడిగింది..'అన్న చందంగా మహిళల చేతుల్లో గోరింటాకు విరబూస్తుంది. ఆషాఢమాసం వచ్చిందంటే చాలు.. అతివల చేతులు, కాళ్లు గోరింటాకుతో నిండిపోయి, పండిపోతాయి. ఈ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం తరతరాలుగా వస్తున్న సంప్రదాయం. గోరింటాకు అసలు పేరు గౌరింటాకు(గౌరి ఇంటి ఆకు). ఒక రోజు గోరింటాకును గౌరి కోస్తుండగా చేతులు ఎర్రబడతాయి. దీన్ని చూసిన పర్వతరాజు స్త్రీ సౌభాగ్యానికి చిహ్నంగా వర్ధిస్తారు. గోరంటాకు ఆడపిల్లలకు అందమే కాదు ఆరోగ్యానికి కూడా మంచిదేనని నిపుణులు అంటున్నారు. అటువంటి గోరంటాకు ప్రత్యేకత, ప్రయోజనాలపై 'సాక్షి'ప్రత్యేక కథనం..

– ఖమ్మం గాంధీచౌక్

పలువురికి ఉపాధి..

మెహందీని చేతులకు, కాళ్లకు పెట్టడంలో రాజస్తానీలు దిట్ట. రాజస్థాన్‌కు చెందిన కొందరు మెహందీని వృత్తిగా ఎంచుకొని ఖమ్మం నగరంలో వస్త్ర దుకాణాల వద్ద, ఫ్యాన్సీ దుకాణాలను తమ అడ్డాలుగా మార్చుకొని ఉపాధి పొందుతున్నారు. ఆల్బమ్‌లో తాము రూపొందించుకున్న డిజైన్లను మహిళలకు చూపిస్తూ.. చేతులు, కాళ్లకు మెహందీలు పెడుతున్నారు. డిజైన్‌ను బట్టి రూ. 50లు మొదలు, రూ. 500ల వరకు కూడా తీసుకుంటారు. గ్రామాల్లో గోరంటాకు ఎక్కువగా ప్రాధాన్యం ఉంటే.. పట్టణాలు, నగరాల్లో మెహందీని ఎక్కువగా ఆదరిస్తున్నారు.

ప్రయోజనాలు అనేకం..

ఆషాఢంలో వచ్చే వాతావరణ మార్పుల ప్రభావం శరీరంపై పడకుండా ఉండి.. ఎలాంటి చర్మ వ్యాధులు రాకుండా చేసేందుకు గోరింటాకు ఎంతగానో ఉపకరిస్తుంది. ఇది శరీరంలోని అతి ఉష్ణం తొలగిస్తుందని, స్త్రీల గర్భాశయ దోశాలను తొలగిస్తుందని, గోరంటాకు పండటం మగువ ఆరోగ్యాన్ని కూడా ఓ సూచికగా పూర్వీకులు చెబుతున్నారు. గోరంటాకు బాగా పండితే మంచి భర్త వస్తాడని కూడా పెద్దలు చెబుతున్నారు.

ఆనందం, ఆరోగ్యం..

గోరింటాకు అంటే ఆడపిల్లలకు ఎంతో ఇష్టం. గ్రామాలు, పట్టణాల్లో గోరింటాకులను తెంపుకొని రోట్లో నూరి మరీ చేతులు, కాళ్లకు పెట్టుకుంటారు.



ఖమ్మం కస్బాబజార్‌లో గోరింటాకు విక్రయం

కులమతాలకు అతీతంగా, చిన్నపెద్ద తేడా లేకుండా మహిళలు వివిధ డిజైన్లలలో చేతులు, కాళ్లకు పెట్టుకుంటారు. కొన్ని కుటుంబాల్లో ఆడ, మగ వారు కూడా ఈ గోరంటాకును పెట్టుకుంటారు.

శుభకార్యాల్లో సంబరంగా..

గోరింట సంబరం అనేది భిన్నమైన సంస్కృతలలో వివాహానికి ముందు జరుపుకునే సంప్రదాయం. పచ్చబొట్టుగా పిలిచే గోరింటాతో మెహందీ ముడిపడి ఉంది. దీంతో పార్టీలైనా పండగలైన మగువల చేతులు, కాళ్లు మెరిసిపోవాల్సిందే. పండగల్లో ప్రత్యేకంగా కనిపించేలా చేసేది అలంకరణ. జ్యూవెలరీ తర్వాత ప్రాముఖ్యత మెహందీకే వస్తుంది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ మెహందీని ఇష్టపడతారు. మన దేశంతో పాటు పశ్చిమ దేశాల్లోనూ మెహందీకి ఆదరణ ఎక్కువే.

గోరింటాకు.. సంప్రదాయం



ప్రతీ ఆషాఢ మాసంలో గోరంటాకు పెట్టుకోవడం మా సంప్రదాయం. గోరంటాకు పెట్టుకోవటం అంటే చాలా ఇష్టం. గోరంటాకు శరీరంలో ఉన్న ఉష్ణోగ్రతలను తగ్గిస్తుంది. ఇటీవల కాలంలో ఆడవారు మెహందీల వైపు ఆసక్తి చూపుతున్నారు. ఏ శుభకార్యాల్లోనైనా ఆడవారికి మెహందీ ఓ అవసరంలా మారింది.

– సూరం సీత, ద్వారకానగర్, ఖమ్మం

ఆరోగ్యానికి ఎంతో మేలు..



గోరింటాతో ఆరోగ్యానికి ఎంతో మేలు. దీని ద్వారా ఆడపిల్లలకు అందం, ఆనందంతో పాటు ఆరోగ్యాన్ని కూడా ఇస్తుంది. వయస్సుతో సంబంధం లేకుండా ఆడవారందరూ పెట్టుకుంటాం. గోరంటాకు పెట్టుకోవడానికి ఓ రోజు కేటాయించుకొని మరీ ప్రత్యేకంగా పెట్టుకుంటాం. ఆరోజు మాకు ఒక పండగన్నట్టే.

– పరిమి అనంతలక్ష్మి, మామిళ్లగూడెం, ఖమ్మం

గోరింట మొక్కలు నాటాలి..



గోరంటాకు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రతీ ఇంటా గోరింట మొక్కలను నాటాలి. చర్మ వ్యాధులు రాకుండా చేసి శరీర ఉష్ణోగ్రతను సమతుల్య పరుస్తుంది. కేశాలు, చర్మానికి అలంకరణకు వాడే హెన్నా..గోరింటాకులో కెమికల్స్ కలిపి తయారు చేస్తారు. దీని కంటే గోరింటాకు రోట్లో నూరి డైరెక్ట్‌గా పెట్టుకోవడం మంచిది.

– జి.అనసూయ, జిల్లా ఉద్యాన అధికారి

సీజనల్ వ్యాధులు అరికట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామాలు, పట్టణాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి సీజనల్ వ్యాధుల నుంచి ప్రజలను రక్షించాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.శిరోమణి, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ. రాకేష్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లలిత, ఝాన్సీ డిమాండ్ చేశారు. శనివారం ఈమేరకు స్థానిక వైద్యశాఖ అధికారి మోతిలాల్‌కు వైద్య సమస్యలపై కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పారిశుద్ధ్య పనులను చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నా.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వరకు చేరుకునే పరిస్థితి లేకపోవడంతో ఆరోగ్య కేంద్రాల చుట్టూ అపరిశుభ్రంగా ఉంటూ బాధితులు రోగాల బారీన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేసి, గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి సీజనల్ వ్యాధులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్, పీఓడబ్ల్యూ నాయకులు మంగతాయి, మోహన్ రెడ్డి, ప్రేమ్‌సింగ్, చందు, వెంకటేశ్వర్లు, స్వాతి, రవీందర్, రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ అమలు చేయాలని వినతి

తిరుమలాయపాలెం: రైతాంగం తీసుకున్న బ్యాంకు రుణాలను పూర్తిగా మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన శనివారం మండల తహసీల్దార్ పుల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం గత ఎన్నికల సమయాన ఇచ్చిన హామీని విస్మరించడంతో అప్పులు పేరుకుపోయాయని, అప్పులు చెల్లించాలని బ్యాంకర్లు ఒత్తిడి తెస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ ఎరువులు, పురుగుమందులను అరికట్టాలని, పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలు వెంటనే ఇవ్వాలని, 55 ఏళ్లు నిండిన రైతులకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, నాయకులు బ్రహ్మాచారి, మల్సూర్, వీరస్వామి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పంచాయతీ కార్మికుల వంటావార్పు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీపీ వర్కర్లు చేస్తున్న సమ్మె శనివారం పదో రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా పంచాయతీ కార్మికులు వినూత్నంగా వంటావార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు. సమ్మె శిబిరాన్ని పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. జీపీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంరూరల్: జలగంనగర్ శిబిరంలో వంటావార్పులో పాల్గొన్న కార్మికులు, సర్పంచ్‌లు



నేలకొండపల్లి: శిబిరం వద్ద మాట్లాడుతున్న ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రంగారావు



తిరుమలాయపాలెం: మద్దతు ప్రకటిస్తున్న ఎన్‌డీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ధర్నా



ధర్నా చేస్తున్న మాదిగ హక్కుల దండోరా నేతలు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని మాదిగ హక్కుల దండోర రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తానని చెప్పి మాదిగలను మోసం చేస్తుందని ఆరోపించారు. తక్షణమే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి, చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో జిల్లా అధ్యక్షుడు దుపెల్లి శ్రీను మాదిగ, ప్రచార కార్యదర్శిగా వీరస్వామి, మహిళా అధ్యక్షురాలు నారపోగు నాగమణి, ఖమ్మం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బంక వెంకన్న, నాగేశ్వరావు, కాటయ్య, నరేష్, మధు, జంగం వెంకయ్య, గంగస్వామి, తిరుపతయ్య పాల్గొన్నారు.

విశ్వరూపం సభను జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్ర ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకునేందుకు ఆగష్టు రెండో వారంలో హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూపం మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ యాతాకుల రాజన్న కోరారు. శనివారం ఖమ్మంలోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతకై ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కన్వీనర్ సునిల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు ఈదయ్య, అంజయ్య, ప్రభాకర్, రాము, నాగభూషణం, హనుమంతరావు, శ్రీనివాస్, నరసింహారావు, బాబు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీఐ రాష్ట్ర స్థాయి సమావేశాన్ని..

ఈనెల 17న హైదరాబాద్‌లోని బేగంపేటలో హరితప్లాజాలో నిర్వహించే రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్రస్థాయి సమావేశాన్ని కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో వచ్చి జయప్రదం చేయాలని ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు పసుల రవికుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సంజీవరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. అంబేడ్కర్ ఆలోచన విధానంతోనే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి తమ పార్టీ కృషి చేస్తుందన్నారు.

పాలేరు రిజర్వాయర్ సందర్శన

కూసుమంచి: పాలేరు రిజర్వాయర్‌ను శనివారం అసిస్టెంట్ కలెక్టర్ రాధికా గుప్తా సందర్శించారు. శిక్షణలో భాగంగా ఆమె జల వనరులపై అవగాహన కోసం వచ్చారు. పాలేరు రిజర్వాయర్‌తో పాటు నాయకన్‌గూడెం వద్ద ఇన్‌ఫాల్ రెగ్యులేటర్‌ను పరిశీలించాక పాలేరు ఈఈ వెంకటేశ్వర్లు, డీఈఈ మధు ద్వారా రిజర్వాయర్ నిర్మాణం, నీటి నిలువ సామర్థ్యం, ఆయకట్టు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని ఎర్రగడ్డతండా వద్ద నిర్మించిన భక్తరామదాసు ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు వ్యయం, ఆయకట్టు, నీటిసరఫరా జరిగే తీరును తెలుసుకున్నారు. పోచారం వద్ద నిర్మాణంలో సీతారామ ప్రాజెక్టు కాల్వను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



పాలేరు రిజర్వాయర్ వద్ద వివరాలు తెలుసుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్

మెనూ కచ్చితంగా అమలు చేయాలి

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూను కచ్చితంగా అమలు చేయాలని పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. మండలంలోని చెరువుమాదారం ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో పలువురు పేరెంట్స్ మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, మెనూ బోర్డును బయట ఏర్పాటు చేయాలని, కనీస సౌకర్యాలపై ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. ఈమేరకు పలువురు గ్రామ పెద్దలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భిక్షమయ్య, విద్యా కమిటీ చైర్మన్ ఉప్పలయ్య, గ్రామ పెద్దలు అమరగాని యల్లయ్య, మస్తాన్, నాగార్జున, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెచ్‌ఎం భిక్షమయ్య

లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన పచ్చదనం, పరిశుభ్రత

ఖమ్మంగాంధీచౌక్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యాన శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. అమెరికాలోని బోస్టన్ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్‌గా నియమితులై ప్రమాణ స్వీకారం చేసి, ఖమ్మం వచ్చిన సీహెచ్‌వీ శివప్రసాద్‌కు ఖమ్మం లయన్స్ క్లబ్ ప్రతినిధులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కె.సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి బి.పుల్లారెడ్డి, కోశాధికారి పి.సుధాకర్, డాక్టర్ ఎ.రాఘవరెడ్డి, డాక్టర్ సత్యనారాయణరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ స్తంభాద్రి ప్రతినిధులు నల్లమల ప్రసాద్, మలిశెట్టి మదన్‌మోహన్, లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డ్ ప్రతినిధులు అప్పారావు, వెంకటేశ్వరరెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, జాన్ మిల్టన్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.



శివప్రసాద్‌ను సత్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

భరతనాట్యంలో చిన్నారికి బంగారు పతకం



బంగారు పతకం, ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న పాఠశాల నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన ముంజాల అర్చన మహారాష్ట్రలోని నాగపూర్‌లో నిర్వహించిన డ్యాన్స్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించింది. అఖిల నటరాజాం అంతర సాంస్కృతిక సంఘ్, మెంబర్ ఆఫ్ ది ఇంటర్నేషనల్ డ్యాన్స్ కౌన్సిల్ సీఐడీ, పారిస్, ఫ్రాన్స్ వారి ఆధ్వర్యాన జూన్ 17న నిర్వహించిన ఓలంపియాడ్ డ్యాన్స్ పోటీల్లో భరతనాట్యం సబ్ జూనియర్స్ విభాగంలో చిన్నారి ఈ ఘనత సాధించింది. కాగా, శనివారం నిర్వాహకులు పంపిన గోల్డ్ మెడల్, ట్రోఫీ, ప్రశంసా పత్రాలను నగరంలోని గూగుల్ కిడ్స్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న అర్చనకు శనివారం పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, పాఠశాల నిర్వాహకులు కృష్ణప్రసాద్, నాట్య గురువు వీరూనాయక్‌లు అందించి అభినందించారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

నేలకొండపల్లి: కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటి కో–చైర్మన్‌గా ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం కల్పించినందుకు పార్టీ శ్రేణులు శనివారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాణాసంచాలు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు రాయపూడి నవీన్, దొనకొండ రామకృష్ణ, డివిజన్ నాయకులు చెరువు స్వర్ణ, బోయిన వేణు, యం.వెంకన్న, మండల నాయకులు కుక్కల హనుమంతరావు, యాతాకుల శ్రీనాథ్, సూరేపల్లి రవి, వాకా శ్రీనాథ్, చిలకల సీతారావమ్మ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో లోక్యాతండా విద్యార్థినికి సీటు



వడిత్య నవ్య

కూసుమంచి: మండలంలోని లోక్యాతండాకు చెందిన వడిత్య నవ్య బాసరలోని ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి అర్హత సాధించింది. కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన నవ్య పదో తరగతిలో 9.5 జీపీఏ సాధించింది. ఇదే పాఠశాలకు చెందిన కీర్తన మొదటి జాబితాలో సీటు పొందగా, నవ్య రెండో జాబితాలో ఎంపికైంది. ఈమేరకు పాఠశాల హెచ్‌ఎం రేల విక్రమ్‌రెడ్డి, ఉపాధ్యాయులు నవ్యను అభినందనలు తెలిపారు.

రెజొనెన్స్ డైరెక్టర్లకు పలువురి పరామర్శ



రాధాకృష్ణ (ఫైల్)

ఖమ్మం సహకారనగర్: విద్యుత్ శాఖ విశ్రాంత ఉద్యోగి కొల్లిపర రాధాకృష్ణ (75) శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఖమ్మంలో వీడీవోస్ కాలనీలోని శ్రీకృష్ణ టవర్స్‌లో నివాసముంటున్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకుంటుండగా కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు రవికుమార్ ఉన్నారు. అలాగే, కుమార్తె, అల్లుడు రాజావాసిరెడ్డి నీలిమ, ఆర్.వీ.నాగేంద్రకుమార్ రెజొనెన్స్, సర్వజ్ఞ విద్యాసంస్థల డైరెక్టర్లుగా ఉన్నారు. ఈమేరకు రెజొనెన్స్ డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు, అభ్యాసన విద్యాసంస్థల డైరెక్టర్లు రాంప్రసాద్, చైతన్యతో పాటు వివిధ పార్టీల నాయకులు పోటు ప్రసాద్, ఉదయ్‌భాస్కర్, భాగం హేమంతరావు తదితరులు రాధాకృష్ణ మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు.

పాఠశాలల్లో బోనాల పండుగ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో ఆషాఢ మాసం సందర్భంగా బోనాల పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులు బోనాలను నెత్తిన పెట్టుకొని సంప్రదాయ పద్ధతుల్లో వస్త్రాలు ధరించి పండగ వాతావరణం తీసుకొచ్చారు. చిన్నారుల వేశధారణలు, నృత్యాలు పలువురిని అలరించాయి. ఈమేరకు యాజమాన్యాలు విద్యార్థులకు పండుగ ప్రాధాన్యతను వివరించారు.



టైనిటాట్స్‌లో బోనాల వేడుకలు



న్యూ ఇరాలో నృత్యాలు చేస్తూ..



స్మార్ట్‌కిడ్జ్‌లో చిన్నారుల ప్రదర్శన..